# నమస్తే తెలంగాణ
# వికారాబాద్
13 హైదరాబాద్, శనివారం 13 జనవరి 2024 VIKARABAD


# ఆధార్ లేదు.. కేసు నమోదు చేయం

## బాధితులను తిప్పి పంపిన హబీబ్‌నగర్ పోలీసులు

## అదృశ్యమైన యువతి.. మొయినాబాద్‌లో అనుమానాస్పద మృతి

## పోలీసుల నిర్లక్ష్యంపై హైదరాబాద్ సీపీ ఆగ్రహం

## ఎస్సై సస్పెండ్.. ఎస్‌హెచ్‌వోకు మెమో

సిటీబ్యూరో/మెహిదీపట్నం , జనవరి 12 (నమస్తే తెలంగాణ): చాదర్‌ఘాట్ హిట్ అండ్ రన్ ఉదంతం మరువకముందే.. మరోసారి అక్కడి పోలీసుల నిర్లక్ష్యం బయటపడింది. ఆధార్ లేకుంటే.. కేసు నమోదు చేయమంటూ.. అదృశ్యమైన యువతి కుటుంబ సభ్యులను తిప్పి పంపించారు. కనిపించకుండాపోయిన ఆ యువతి మొయినాబాద్‌లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. హబీబ్‌నగర్ పోలీసుల నిర్లక్ష్యం బయట పడటంతో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి స్వయంగా ఠాణాకు వెళ్లి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యానికి కారకుడైన ఎస్సైని సస్పెండ్ చేస్తూ, ఠాణా ఎస్‌హెచ్‌వోకు సీపీ మెమో జారీ చేశారు. అయితే, 10 రోజుల కిందట చాదర్‌ఘాట్‌లో ఇలాంటి ఉదంతం వెలుగులోకి వచ్చింది. చికిత్స పొందుతూ మృతి చెందిన వ్యక్తి ..హిట్ అండ్ రన్‌లో చనిపోయింది..ఒక్కరేనని గుర్తించడంలో చాదర్‌ఘాట్ పోలీసులు నిర్లక్ష్యం వహించారు. కుటుంబసభ్యులే దవాఖానకు వెళ్లి మృతుడిని గుర్తించారు.

### తాజా ఘటనలో అసలేం జరిగింది..

మల్లేపల్లి గోకుల్ నగర్ మొఘల్ గ్రౌండ్ సమీపంలో నివసించే తహసీన్ బేగం(22) బీకామ్ రెండో సంవత్సరం చదువుతున్నది. ఈ నెల 8న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. అదే రోజు రాత్రి కుటుంబసభ్యులు హబీబ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వయస్సులో మిస్సింగ్ అంటే ఏమిటో అందరికీ తెలుసు...ఫొటో ఏదీ..? ఆధార్ కార్డు ఏదీ..మీరు ఈ ప్రాంతంలో ఉంటారని గ్యారెంటీ ఏమిటీ... ? ముందు వెళ్లి ఆ అమ్మాయి ఆధార్ కార్డు, మీ ఆధార్ కార్డు పటుకొని రావాలం'టూ.. సెక్టార్ ఎస్సై శివ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. 10న మరోసారి కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లినా... తుతూ మంత్రంగా వివరాలు తీసుకొని చూస్తామంటూ పంపించేశారు. కేసు మాత్రం నమోదు చేయలేదు. ఈ క్రమంలోనే మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాకారం వద్ద ఈనెల 8న అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని యువతి మృతి చెందింది. సైబరాబాద్ పోలీసులు ఆ యువతి ఆచూకీ కోసం వివిధ ఠాణాల్లో అదృశ్యమైన కేసులను తెలుసుకున్నారు. వివిధ కోణాల్లో ఆధారాలను విశ్లేషించిన సైబరాబాద్ పోలీసులు.. ఆ మృతురాలు మల్లేపల్లికి చెందిన యువతిగా గుర్తించారు.

### నిర్లక్ష్యంపై ఆగ్రహం..

సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి హబీబ్‌నగర్ ఠాణాకు స్వయంగా వెళ్లి రికార్డులను తనిఖీ చేశారు. ఆధార్‌కార్డు లేకపోవడంతో కేసు నమోదు చేయలేదని తెలుసుకున్న సీపీ.. ఎస్సై శివను సస్పెండ్ చేస్తూ.. ఇన్‌స్పెక్టర్ రాంబాబుకు మెమో జారీ చేశారు.



హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ శ్రీనివాస్‌రెడ్డి

# తప్పులు లేకుండా డేటా ఎంట్రీ చేయాలి

శంకర్‌పల్లి జనవరి12: అభయహస్తం దరఖాస్తుల్లోని డేటాను తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలని రంగారెడ్డి జిల్లా మెప్మా పీడీ శంకర్‌సింగ్ అన్నారు. శుక్రవారం శంకర్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో జరుగుతున్న వివరాల ఆన్‌లైన్ నమోదును ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకుని దరఖాస్తులు చేసుకున్నారని, ఆపరేటర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా విధులు నిర్వహించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్, సిబ్బంది అనూష, తదితరులు పాల్గొన్నారు.


డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న మెప్మా పీడీ శంకర్‌సింగ్

# పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం

తెలంగాణ భవన్‌లో భువనగిరి పార్లమెంట్ సన్నాహక సమావేశాన్ని నిర్వహించిన కేటీఆర్

పాల్గొన్న బీఆర్‌ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల ప్రతినిధులు, ముఖ్య నేతలు

భువనగిరితో సహా అన్ని పార్లమెంట్ స్థానాల్లో గులాబీ జెండా ఎగురవేయాలని ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన కేటీఆర్


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రంగారెడ్డి, జనవరి 12(నమస్తే తెలంగాణ) : రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే ఘన విజయమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. భువనగిరి సహా అన్ని ఎంపీ స్థానాల గెలుపునకు రెట్టించిన ఉత్సాహంతో పనిచేద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భువనగిరి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి బీఆర్‌ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డితోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నేతలు హాజరయ్యారు. భువనగిరి గడ్డపై గులాబీ జెండాను ఎగరవేయాలని నేతలకు ఈ సందర్భంగా కేటీఆర్ దిశానిర్దేశం చేశారు.

### తెలంగాణ గళం.. బలం బీఆర్‌ఎస్..

తెలంగాణ గళం..బలం..దళం బీఆర్‌ఎస్ సొంతమని కేటీఆర్ పేర్కొన్నారు. పార్లమెంటులో తెలంగాణ గళం వినిపించేందుకు భారీ స్థానాలను బీఆర్‌ఎస్ గెలుచుకునేలా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. యాచించి కాకుండా శాసించి తెలంగాణ హక్కులను సాధించుకోవాలన్న ప్రొఫెసర్ జయశంకర్ నినాదాన్ని నిజం చేయాలన్నారు. ఎక్కడ కోల్పోయామో అక్కడే వెతుక్కోవాలని, 37 శాతం వచ్చిన ఓట్ల భాగస్వామ్యానికి మరో 4.5శాతం జోడిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో జయకేతనం ఎగురవేయడం ద్వారా ఆతర్వాత వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పార్టీ కార్యకర్తలు సత్తా చాటాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి గడిచిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ మరవకూడదన్నారు. తెలంగాణ ప్రజానీకం ఎల్లవేళలా బీఆర్‌ఎస్ వెన్నంటే ఉంటుందని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడిపోవడానికి ప్రధానంగా కొన్ని కారణాలను ఇటీవల నిర్వహించిన పది పార్లమెంట్ సన్నాహక సమావేశాల్లో గుర్తించామన్న కేటీఆర్ వాటిని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు వివరించి అవసరమైన సూచనలు చేశారు.

### కాంగ్రెస్ వైఖరిని ఎండగట్టాలి..

అమలుకాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వాటిని అమలు చేయలేక చేతులెత్తేసే క్రమంలో శ్వేత పత్రాలను విడుదల చేసి ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చేస్తున్నదని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చింది ఆరు గ్యారెంటీలు కాదని, ఎస్సీ, బీసీ, మహిళా తదితర డిక్లరేషన్లతో కలిపి 420 హామీలను ఇచ్చిందన్నారు. నిరుద్యోగ భృతి, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయ హోదా వంటి హామీలపై ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం నాలుక మడతేసిందని ఎద్దేవా చేశారు. రైతు బంధు రాక, కరెంటు కోతలతో ఇప్పటికే గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు అసహనంతో ఉన్నారని పేర్కొన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ కాంగ్రెస్ నేతలను నిలదీయాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు.

### భువనగిరిలో మరోసారి సత్తా చాటేలా..

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో మరోసారి పాగా వేసేందుకు బీఆర్‌ఎస్ పార్టీ ఆచితూచి అడుగులు వేస్తున్నది. 2009లో ఏర్పాటైన ఈ పార్లమెంట్ నియోజకవర్గానికి ఇప్పటివరకు మూడుసార్లు ఎన్నికలు జరగగా.. ఒకసారి బీఆర్‌ఎస్, రెండుసార్లు కాంగ్రెస్ గెలుపొందింది. ఈ పార్లమెంట్ పరిధిలో నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలకు చెందిన భువనగిరి, ఆలేరు, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్‌తోపాటు జనగామ జిల్లాలోని జనగామ, రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం సెగ్మెంట్లు ఉన్నాయి. మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ.. బీఆర్‌ఎస్ పార్టీ బలంగా ఉంది. ఈసారి ఈ స్థానాన్ని ఎలాగైనా కైవసం చేసుకునేలా బీఆర్‌ఎస్ పార్టీ వ్యూహాన్ని రచిస్తున్నది. బలమైన నేతను ఇక్కడి నుంచి బరిలో నిలిపేలా ఆలోచన చేస్తున్నట్లు సన్నాహక సమావేశంలో కేటీఆర్ పార్టీ నేతలతో ప్రస్తావించినట్లు తెలిసింది.


# స్వామి వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

ఎంపీ రంజిత్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్


స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న శాసన సభాధిపతి గడ్డం ప్రసాద్‌కుమార్, ఎంపీ రంజిత్‌రెడ్డి

చేవెళ్లటౌన్, జనవరి 12: నేటి యువత స్వామి వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలని ఎంపీ రంజిత్‌రెడ్డి, రాష్ట్ర శాసన సభాధిపతి గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. చేవెళ్ల పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద విగ్రహాన్ని వారు ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎంపీ, స్పీకర్ మాట్లాడుతూ భారతదేశ ప్రఖ్యాతిని, మన సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద అన్నారు. భారతదేశంలోనూ, పాశ్చాత్య దేశాల్లోనూ తన గురువు రామకృష్ణ పరమాహంస పేరు మీదుగా రామకృష్ణ మిషన్, రామకృష్ణ మఠాలను స్థాపించి ఎందరో విద్యావంతులను సమాజసేవకు అంకితం చేశారన్నారు.యువతకు స్ఫూర్తిగా, మార్గనిర్దేశకుడిగా నిలిచిన స్వామి వివేకానంద జయంతి సందర్భంగా చేవెళ్లలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం గొప్ప విషయమన్నారు. మందలో ఒకడిగా కాకుండా.. వందలో ఒకడిగా ఉండాలంటూ ప్రతి ఒక్కరిని ఆయన ఆలోచింపజేశారన్నారు. కార్యక్రమంలో అఖిల భారత సాహిత్య పరిషత్ సంఘటన కార్యదర్శి భాస్కర యోగి, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ బాధ్యుడు భీం భరత్, జడ్పీటీసీ సభ్యురాలు మాలతి, మండల పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, చేవెళ్ల గ్రామ సర్పంచ్ బండారి శైలజాఆగిరెడ్డి, చేవెళ్ల సొసైటీ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, ముడిమ్యాల సొసైటీ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఎర్ర మల్లేశ్, ఉప సర్పంచ్ గంగి యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, నాయకులు రమణారెడ్డి, ఆగి రెడ్డి, అత్తెల్లి అనంత్ రెడ్డి, దుర్గా ప్రసాద్, పెంజర్ల అనంత రెడ్డి, గోపాలాచారి పాల్గొన్నారు.

# హత్యా.. ఆత్మహత్యా?



మానసిక ఒత్తిడితోనే ఆత్మహత్యగా తేల్చిన పోలీసులు

కలకలం రేపిన మొయినాబాద్ యువతి అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. మృతురాలు పాతబస్తీకి చెందిన యువతిగా గుర్తించారు. ఆమెది హత్య కాదు..ఆత్మహత్యగా తేల్చారు. ఈనెల 8న మొయినాబాద్, బాకారం గ్రామం, డ్రీమ్ వ్యాలీ రిసార్ట్ సమీపంలో గుర్తుతెలియని మృతదేహం కాలిపోతున్నట్లు 100 నంబర్‌కు కాల్ వచ్చింది. పోలీసులు అక్కడికి చేరుకునే సరికే మృతదేహం పూర్తిగా కాలిపోయింది. ఘటనా స్థలిలో సిమ్ లేని సెల్‌ఫోన్ కనిపించింది. క్లూస్‌టీమ్, జాగిలాలతో పరిసరాల్లో ఆధారాలను సేకరించారు. తొలుత ఆ యువతిని ఎవరో హత్యచేసి కాల్చివేసినట్లు అనుమానించిన పోలీసులు.. మృతురాలిని గుర్తించే క్రమంలో దర్యాప్తు ప్రారంభించారు. మొయినాబాద్ పోలీసులతో పాటు రాజేంద్రనగర్ సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగి సీసీ కెమెరాలు, టవర్ లొకేషన్, సిమ్‌కార్డ్ ట్రాకింగ్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 200 మిస్సింగ్ కేసులను విశ్లేషించారు.

-సిటీబ్యూరో, జనవరి 12 (నమస్తే తెలంగాణ):

## మొయినాబాద్ యువతి మృతి కేసులో ప్రశ్నలెన్నో

## ఎట్టకేలకు మృతురాలిని గుర్తించిన పోలీసులు

## అనుమానాలకు తావిస్తున్న పోలీసుల భిన్న ప్రకటనలు

**పోలీసుల కథనం** ప్రకారం.. ఈనెల 8న మధ్యాహ్నం 1.30 నుంచి 2 గంటల సమయంలో ఒక ఆటో యెంకపల్లి నుంచి బాకారం వైపు వెళ్లినట్లు సీసీ కెమెరాలో రికార్డు అయింది. ఆ ఫుటేజీ ఆధారంగా ఆటో డ్రైవర్‌ను రాజేంద్రనగర్‌కు చెందిన సయీద్ వాసిమ్‌గా గుర్తించారు. అతడిని విచారించగా ఆ రోజు ఉదయం 11.30 గంటల సమయంలో ఓ యువతి మల్లేపల్లిలో తన ఆటో ఎక్కిందని, డ్రీమ్ వ్యాలీకి వెళ్లాలని రూ.1100కు మాట్లాడినట్లు వెల్లడించాడు. తొలుత మురాద్‌నగర్‌లోని తన స్నేహితుల ఇంటికి వెళ్లాక.. హుమాయున్‌నగర్‌లోని రాయల్ కాలనీలో ఉన్న మరో స్నేహితురాలి ఇంటికి వెళ్లిందన్నాడు. 15 నిమిషాల తరువాత వచ్చిన యువతి ఐదు లీటర్ల డబ్బా ఉన్న బ్యాగ్‌తో వచ్చి, తిరిగి ఆటోలో ఎక్కి మొయినాబాద్ డ్రీమ్ వ్యాలీ వెళ్లినట్లు వెల్లడించారు. అక్కడ ఓ ఫామ్‌హౌస్ వద్ద ఆటో దిగిన ఆ యువతి.. తనకు ఆటో చార్జ్ రూ.1100 ఇచ్చినట్లు డ్రైవర్ తమ విచారణలో వెల్లడించాడని పోలీసులు తెలిపారు. ఆ తరువాత మధ్యాహ్నం 1.53 గంటల సమయంలో తన స్నేహితుడైన రాహిల్‌కు ఫోన్ చేసి, ఆ తరువాత తన మొబైల్‌ను స్విచ్ఛాఫ్ చేసినట్లు దర్యాప్తులో నిర్ధారించారు. ఈ ఫోన్ కాల్ ఆధారంగా రాహిల్‌ను విచారించగా సదరు యువతి పాతబస్తీలోని మల్లేపల్లికి చెందిన తహసీన్ బేగంగా గుర్తించినట్లు తెలిపారు. తహ్సీమ్ బేగం తన క్లాస్ మేట్ ఒక స్నేహితురాలితో చాలా సన్నిహితంగా ఉండేది. ఈ క్రమంలో ఇటీవల ఇరువురి మధ్య తలెత్తిన మనస్పర్థలతో కొన్ని రోజులుగా ఇరువురు దూరంగా ఉంటున్నారని, అంతేకాకుండా వీరి సన్నిహిత్యంపై కుటుంబసభ్యులు అభ్యంతరం చెప్పడంతో తహసీన్ బేగం డిప్రెషన్‌కు గురై, గతంలో ఓ సారి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు వివరించారు. ఈ క్రమంలోనే మానసిక ఒత్తిడికి లోనైన తహసీన్ బేగం తన స్నేహితురాలి ఎడబాటును తట్టుకోలేక ఆత్మాహుతికి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు.

## ఈ ప్రశ్నలకు బదులేది

- ఘటనా స్థలిలో యువతి మృతదేహాన్ని పరిశీలించిన మొయినాబాద్ పోలీసులు..ఎక్కడో హత్య చేసి..ఇక్కడకు తీసుకొని.. పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు ఉందని, ఇది ముమ్మాటికీ హత్యేనని జనవరి 8న వెల్లడించారు.
- మృతురాలు హబీబ్‌నగర్‌కు చెందిన యువతిగా గుర్తించి, ఆమెది అనుమానాస్పద మృతి అయిన, జరిగిన పరిణామాలతో ఆత్మహత్యగా భావిస్తున్నామని, పోస్టుమార్టం నివేదిక తరువాత అసలు విషయం వెలుగులోకి వస్తుందంటూ సైబరాబాద్ పోలీసులు ఆ తర్వాత ప్రకటించారు.
- ఘటన జరిగిన రోజు, మృతురాలు గుర్తించిన తర్వాత రెండు వేర్వేరు వాదనలు పోలీసులు వెల్లడించడం వెనుక కారణాలేమిటి అనే విషయాలు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి.
- ఆత్మహత్య అయితే ఘటన స్థలంలో మృతురాలు మంటల్లో కాలుతూ.. అటు ఇటూ కదిలిన అనవాళ్లు ఉండాలి. సెల్‌ఫోన్‌లో సిమ్‌కార్డు ఎందుకు తీస్తుందనే సందేహాలు వస్తున్నాయి.
- శరీరంతో పాటు దుస్తులు కూడా పూర్తి కాలిపోయాయని, జీన్స్ పాయింట్‌కు ఉండే పౌచ్ మాత్రమే దొరికిందని..ఆ యువతి జీన్స్ వేసుకుని ఉండవచ్చని లేదా ఏదైనా హ్యాండ్ బ్యాగ్ ఉండవచ్చని ఘటన జరిగిన రోజు పోలీసులు తెలిపారు. ఇది మినహా మిగిలిన ఆధారాలేవీ లేవని స్పష్టం చేశారు. ఎఫ్ఐఆర్‌లో ఓ ప్రత్యక్ష సాక్షి తనకు అక్కడ అగ్గిపెట్టె కనిపించిందని చెప్పారు. కానీ ఇప్పుడు పోలీసులు పెట్రోలు క్యాన్ కూడా ఉందని చెబుతున్నారు.
- ఘటన జరిగిన రోజు కాలిన మృతదేహం దగ్గర కేవలం ఫోన్ మాత్రమే దొరికిందని, అందులో సిమ్‌లేదని పోలీసులు చెప్పారు. కానీ శుక్రవారం మాత్రం ఫోన్‌నంబర్ ఆధారంగా ఆమెను గుర్తించినట్లు చెప్పారు. ఇలా పలు అంశాల్లో అస్పష్టత ఉండటంతో ఇది హత్యనా? ఆత్మహత్యనా? అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలోనే శుక్రవారం మృతురాలిని పాతనగరానికి చెందిన యువతిగా గుర్తించిన పోలీసులు ఆమెది హత్యకాదు, ఆత్మహత్యగా తేల్చేశారు.

# కొడంగల్ అభివృద్ధిపై ప్రజాభిప్రాయ సేకరణ


సమావేశంలో మాట్లాడుతున్న 'కడా'ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్, జనవరి 12 : మున్సిపల్ అభివృద్ధిపై 'కడా' ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. స్థానిక మహిళా సమాఖ్య భవనంలో వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, పట్టణ పురప్రముఖులు, ప్రజలతో సమావేశాన్ని నిర్వహించి మున్సిపల్ ప్రగతిపై చర్చించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డిలతో పాటు ఆయా పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు పలు అంశాలను ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకొచ్చారు. విద్య, వైద్యం, రవాణా, అంతర్గత రోడ్లు, మురుగు కాలువ నిర్మాణం, పార్కులు, ఆటస్థలాలు ప్రధాన కూడళ్ల విస్తరణ వంటి విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా కడా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించారన్నారు. ప్రజలు కోరుకునే వాటి కంటే అధికంగా అభివృద్ధి జరగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కటకం శివకుమార్, టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు ఎండీ యూసూఫ్, బీజేపీ నాయకుడు పున్నం చంద్ లాహొటీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, సీపీఐ నాయకుడు ఇందనూర్ బషీర్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గంజాయి, నిందితులను మీడియాకు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

# భారీగా గంజాయి స్వాధీనం

వికారాబాద్, జనవరి 12 : కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో నలుగురు వ్యక్తులు 77కిలోల గంజాయిని తరలిస్తుండగా శుక్రవారం ఎక్సైజ్, ఆర్‌పీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌చంద్ర వెల్లడించిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రానికి చెందిన లడ్విన్ ఆనంద్, మున్నా వర్ధన్, అజిత్‌రామ్, సామియల్ భువనేశ్వర్ నుంచి ముంబయి వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో 77కిలోల గంజాయిని తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎక్సైజ్, ఆర్‌పీఎఫ్ పోలీసులు వికారాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో దాడులు చేసి సుమారు రూ.20లక్షల విలువగల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతోపాటు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో ఎక్సైజ్ సీఐ రాఘువీణ, ఎక్సైజ్ ఎస్సై కోటేశ్వర్‌రావు, ఆర్‌పీఎఫ్ సీఐ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సంక్రాంతి సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీని చిత్రంలో చూడొచ్చు.